వైభవంగా బ్రహ్మోత్సవాలు

గౌతంనగర్‌: గౌతంనగర్‌ డివిజన్‌ మిర్జాలగూడలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి అభిషేకం, రక్షాబంధనం, అంకురార్పణ, తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయానికి వంట పాత్రల విరాళం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌ మేడిపల్లి శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయానికి లయన్‌ లావణ్య సోమవారం ఆలయ చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డికి దేవాలయ ఆవరణలో వంట పాత్రలను అందజేశారు. లైన్స్‌ అధ్యక్షుడు వేముల నాథం గౌడ్‌, మెంబర్‌ మరియాల అశోక్‌, పల్లె బాల్‌రాజ్‌గౌడ్‌, మహేందర్‌, దుర్గా, లావణ్య, బద్దం రవీందర్‌రెడ్డి, శారదగౌడ్‌, చందన, నందిత, పావని, అంజమ్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బొంతు దంపతులకు పరామర్శ



కుషాయిగూడ: మాజీ మేయర్‌ బొంతు రాంమోహన్‌, కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవిలను పలవురు ప్రముఖులు పరామర్శించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల, టీజీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌, మాజీ ఎంపీ సంతోష్‌, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి బొంతు కమలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్‌ ఉప్పల్‌ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్‌ స్వర్ణరాజ్‌ ఉన్నారు.

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థిని తల్లిదండ్రులను సత్కరిస్తున్న కార్పొరేటర్‌

బోడుప్పల్‌: కృషి, పట్టుదలతో పాటు కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని 14వ డివిజన్‌ కార్పొరేటర్‌ కుంభం కిరణ్‌కుమార్‌ రెడ్డి అన్నారు. బోడుప్పల్‌ 14వ డివిజన్‌ పరిధిలోని ఆర్‌ఎన్‌ఎస్‌ కాలనీలో నివసించే సునీత, నరేష్‌ కుమార్తె శివ జ్యోతిక జోగులాంబ గద్వాల్‌ మెడికల్‌ కాలేజీలో ఎంబీబీఎస్‌ సీటు సాధించింది. అదే కాలనీకి చెందిన శివాణి మెడికల్‌ సీటులో అర్హత, వెంకట్‌రెడ్డి కాలనీలో నివసించే రేణుగుంట స్వాతి రఘునంద డీఎస్సీ పరీక్షలో సిద్దిపేట జిల్లాలో 2వ ర్యాంక్‌ను పొందింది. ఈ సందర్భంగా వారిని కార్పొరేటర్‌ సత్కరించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మంచిగా చదువుకుని వారి తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేయాలని కోరారు.

ఉత్తమ సామాజిక వేత్త అవార్డు ప్రదానం

కుషాయిగూడ: ఈసీఐఎల్‌కు చెందిన సర్వెల్ల సునీల్‌వర్మను తెలుగు రాష్ట్రాల క్షత్రియ సేవాసమితి ఉత్తమ సామాజికవేత్తగా గుర్తించింది. ఆయనకు ఉత్తమ సామాజిక వేత్త అవార్డుతో పాటు రూ.లక్ష రివార్డును ప్రకటించింది. ఈ మేరకు సోమవారం క్షత్రియ సేవా సమితి పెద్దలు శ్రీహరిరాజు, మైనర్‌ రాజు, నాగరాజు, డాక్టర్‌ రఘు, డీవీఎస్‌ఎస్‌. రాజు, డాక్టర్‌ పీవీ. రామచంద్రరాజులు ఆయనకు అవార్డును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. అంబులెన్స్‌, వృద్ధాశ్రమం, గోశాల ఏర్పాటు చేసినందుకు ఆయనను అభినందించారు. గుర్తు తెలియని శవాలను తరలించడంలో తనవంతుగా పోలీసులకు అందజేసిన సహకారానికి గుర్తింపుగా తెలంగాణ పోలీసు విభాగం నుంచి సోషల్‌ వర్కర్‌గా అవార్డులతో పాటు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ అవార్డుతో బాధ్యత పెరిగిందని, సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తానన్నారు.

ప్రజావాణితో సమస్యల పరిష్కారం



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించారు. మొత్తంగా 09 దరఖాస్తులు అందాయని మున్సిపల్‌ అధికారులు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిష్కరించడమే ధ్యేయంగా అధికారులు దృష్టి సారించి పనిచేయాలని మేయర్‌ అమర్‌సింగ్‌ అధికారులను ఆదేశించారు. కమిషనర్‌ త్రిలేశ్వర్‌రావు, డిప్యూటీ ఇంజినీర్‌ సాయినాథ్‌గౌడ్‌, టీపీఓ సుకన్య తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త !

మల్లాపూర్‌: దసరా పండుగకు ఊరు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని నాచారం ఇన్‌స్పెక్టర్‌ రుద్వీర్‌ కుమార్‌ పేర్కొన్నారు. సోమవారం నాచారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో పలు కాలనీల్లో భద్రతపై ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా ఇన్‌స్పెక్టర్‌ మాట్లాడుతూ.. ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు, అధిక మొత్తంలో నగదును ఇంట్లో వదిలి వెళ్లకుండా వాటిని బ్యాంక్‌ లాకర్‌లో దాచుకోవాలని సూచించారు, ఊరికి వెళ్లే సమయంలో పక్కింటి వారికి తమ ఇంటి పరిసరాలను గమనించమని చెప్పాలని సూచించారు. కాలనీల్లో అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే డయల్‌ 100, నాచారం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

మేడిపల్లి: మేడిపల్లి బాపూజీనగర్‌ నూతన అధ్యక్షుడిగా బాల్ద వెంకటేష్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌ 2వ డివిజన్‌ పరిధిలోని బాపూజీనగర్‌ అసోసియేషన్‌ కార్యాలయంలో సోమవారం నూతన కార్యవర్గ ఎన్నిక సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రాజయ్య, కోశాధికారిగా ఉప్పలయ్య, ఉపాధ్యక్షుడిగా కిష్టయ్య, సంయుక్త కార్యదర్శులుగా యాదమ్మ, సలహాదారులుగా సాయిలు, వెంకటయ్యలను ఎన్నుకున్నారు. అనంతరం పూర్తి కార్యవర్గాన్ని ప్రకటించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



గౌతంనగర్‌: గౌతంనగర్‌ డివిజన్‌ సాయినగర్‌లో బీజేపీ నేతలు ఇంటింటికి తిరిగి బీజేపీ సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సభ్యత్వ నమోదులో సుమారు 400 మందికి పైగా బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. బీజేపీ మేడ్చల్‌ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌.శ్రీనివాస్‌ముదిరాజ్‌, తేజ, బాలసుబ్రమణ్యం, గణ, ప్రకాష్‌, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.



మహంకాళి ఆలయంలో..



మారుతీనగర్‌లో..



లలితాదేవీ అలంకరణలో..



ఈస్ట్‌ ఆనంద్‌బాగ్‌లో లలితాదేవీగా..



మహాచండీ అలంకారంలో కట్టమైసమ్మ..



ఊర పోచమ్మ అమ్మవారు..

లలితాదేవీ నమోస్తుతే

ఉప్పల్‌, మల్కాజిగిరి జోన్‌ పరిధిలో అమ్మవారు సోమవారం భక్తులకు శ్రీలలితా గౌరీ త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు.

– ఉప్పల్‌, మల్కాజిగిరి జోన్‌ బృందం.



ఓల్డ్‌ మల్కాజిగిరిలో కార్పొరేటర్‌ శ్రవణ్‌ తదితరులు



మేడిపల్లి వీరాంజనేయస్వామి దేవాలయంలో కార్పొరేటర్లు



కట్టమైసమ్మ ప్రత్యేక అలంకరణ..



కుంకుమార్చలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్‌

రూ.52 లక్షలతో అభివృద్ధి పనులు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్‌ గీత

ఉప్పల్‌: చిలుకానగర్‌ డివిజన్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో రూ. 52 లక్షలతో అభివృద్ధి పనులకు ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్‌ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్‌తో కలసి శంకుస్థాపన చేశారు. బీరప్పగడ్డ కమ్యూనిటీహాల్‌ వద్ద సీసీరోడ్డు, కుమ్మరికుంటలో నూతన సీసీరోడ్డు పనులు, చిలుకానగర్‌ గుట్టపై బ్రహ్మంగారి ఆలయం వద్ద ఓపెన్‌జిమ్‌, నార్త్‌ కళ్యాణపురి పార్కులో ఓపెన్‌జిమ్‌ల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశలవారీగా ప్రాధాన్యత క్రమంలో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పూర్తిచేస్తున్నట్లు వివరించారు. బీరప్పగడ్డ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కమిటీ ప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఉప్పల్‌ రింగ్‌రోడ్డు ట్రాఫిక్‌ను తగ్గించేందుకు..

అధికారులతో జెడ్సీ హేమంత్‌ పాటిల్‌ సమీక్ష



ఉప్పల్‌: ఉప్పల్‌ రింగ్‌ రోడ్డులో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా సోమవారం ఎల్‌బీనగర్‌ జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ కేశవ్‌పాటిల్‌ వివిధ విభాగాల అధికారులతో జాయింట్‌ ఇన్‌స్పెక్షన్‌ నిర్వహించారు. హెచ్‌ఎండీఏ ఎండీ జీవన్‌ బాబు, ఉప్పల్‌ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ ఆంజనేయులు, ఈఈ హరిలాల్‌, టౌన్‌ప్లానింగ్‌ ఏసీపీ విజయలక్ష్మి, మల్కాజిగిరి ట్రాఫిక్‌ ఏసీపీ శ్రీనివాస్‌, ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ లక్ష్మీమాధవిలతో కలిసి పరిస్థితులను సమీక్షించారు. ఉప్పల్‌ చౌరస్తాలో ట్రాఫిక్‌ సమస్య తీవ్రంగా ఉంటుందని ఉప్పల్‌ రింగ్‌ రోడ్డుపై రద్దీని తగ్గించేందుకు ఉన్న అవకాశాలను సమీక్షించారు. త్వరలో పరిష్కారం దిశగా తగిన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

బతుకమ్మ.. బతుకమ్మ.. ఉయ్యాలలో



బతుకమ్మ వేడుకల్లో మహిళా కాంగ్రెస్‌ కార్యదర్శి గద్వాల జ్యోతి



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

మల్కాజిగిరి: ఈస్ట్‌ ఆనంద్‌బాగ్‌ డివిజన్‌ బీజేఆర్‌ నగర్‌లో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. స్థానిక మహిళలు బతుకమ్మలను ఒక్కచోట చేర్చి ఆటపాటలతో సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ వేడుకలకు రాష్ట్ర మహిళా కాంగ్రెస్‌ కార్యదర్శి గద్వాల జ్యోతి హాజరయ్యారు. బతుకమ్మ పండుగలో చివరిదైన సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు.

ఉప్పల్‌ మినీ శిల్పారామంలో..

ఉప్పల్‌: ఉప్పల్‌ మినీ శిల్పారామంలో దసరా, బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ ఆటలు ఆకట్టుకున్నాయి. అభినయ దర్పణం ఆర్ట్స్‌ అకాడమీ నాట్య గురువు ఓలేటి రంగమణి శిష్యబృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వినాయక స్తుతి, మహాగణపతి, సంధ్య తాండవం, అంబ నీరాజనం లాంటి అనేక కార్యక్రమాలు అలరించాయి. శిల్పారామం ఉద్యోగులు బతుకమ్మ ఆడి ఆకట్టుకున్నారు. ముఖ్యఅతిథులుగా కళా బ్రహ్మ శిరోమణి, డాక్టర్‌ వంశీ రామరాజులు హాజరై కళాకారులను అభినందించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

గౌతంనగర్‌: లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ హైదరాబాద్‌ మల్కాజిగిరి సెంట్రల్‌ ఆధ్వర్యంలో ఇటీవల వాణినగర్‌లో మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించగా.. శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి సోమవారం ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్‌ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సలహాలకు టోల్‌ ఫ్రీ

కుషాయిగూడ: ఉచిత న్యాయ సలహాల కోసం టోల్‌ ఫ్రీ నెంబరు 15100 ను సంప్రదించవచ్చని మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వి. బాలభాస్కర్‌ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అందరికీ సమన్యాయం అందించాలనే సంకల్పంతో జాతీయ న్యాయసేవాధికార సంస్థ న్యూఢిల్లీ వారు ఈ అవకాశాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. వారి ఆదేశాల మేరకు ఈ అవకాశాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. టోల్‌ ఫ్రీ నెంబరు 15100ను సంప్రదించి ఉచిత న్యాయసాయం పొందవచ్చని సూచించారు.

సత్కారం



మల్లాపూర్‌: కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర ఓబీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా నియమితులైన మేకల వీరన్నయాదవ్‌ను సోమవారం కాంగ్రెస్‌ నేత బాలుయాదవ్‌ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. రాష్ట్రంలో ఓబీసీ సంక్షేమం కోసం పాటుపడాలని కోరారు. కాంగ్రెస్‌ నేత వెంకట్‌ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



రాజ్‌ కొనొవార్‌

మేడిపల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధి చెంగిచెర్ల తులిప్స్‌ హోటల్‌ సమీపంలో నివాసం ఉంటున్న ప్రభాతరాజ్‌ కొనొవార్‌ (55) ఇంట్లోనే ఉంటున్నాడు. ఈనెల 2న సాయంత్రం ఇంట్లో చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన పారిశ్రామికవేత్తలకు టీ హబ్‌ సహకారం



మాట్లాడుతున్న టీఐఎఫ్‌ అధ్యక్షులు సుధీర్‌రెడ్డి

మల్లాపూర్‌: యువ పారిశ్రామికవేత్తలకు టీహబ్‌, ప్రభుత్వం పరంగా అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్‌ రంజన్‌ అన్నారు. సోమవారం నాచారం ఇండ్రస్టీస్‌ అసోసియేషన్‌, టీ హబ్‌ సంయుక్తాధ్వర్యంలో నాచారం పారిశ్రామికవాడలో సూక్ష్మ, చిన్న మధ్య తరహా పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌ ప్లీనరీ సమ్మిట్‌ నిర్వహించారు. ఈ సమావేశానికి పలువురు పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారు. టీ హబ్‌ సీఈఓ శ్రీనివాస్‌, రాజేష్‌ అడ్లా మాట్లాడుతూ.. యువ పారిశ్రామికవేత్తలు కొత్త టెక్నాలజీతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించవచ్చన్నారు. నూతంగా ఏర్పాటు చేసే కంపెనీలకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తామన్నారు. అనంతరం టీఐఎఫ్‌ అధ్యక్షులు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికి నూతనంగా స్టార్టప్‌లు దండు మల్కాపురంలో 589 కంపెనీలను నెలకొల్పి ఉపాధి కల్పిస్తుందన్నారు. 200 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామికవేత్తలు, 170 స్టార్టప్స్‌ నాచారం ఇండ్రీస్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు డీ.కే జైన్‌, రమేష్‌, గంభీర్‌, నాగేంద్రబాబు, పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణపై అవగాహన ర్యాలీ



అల్వాల్‌: రాజ్యాంగ పరిరక్షణపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందని గద్దర్‌ ఫౌండేషన్‌ ప్రధాన కార్యదర్శి జీవి.సూర్యకిరణ్‌ అన్నారు. అంతర్జాతీయ క్రీడాకారుడు బీఎం .శ్రీనివాస్‌ కర్ణాటక రాష్ట్రం కోలార్‌ నుంచి నాగ్‌పూర్‌ వరకు సైకిల్‌యాత్ర నిర్వహించారు. వెంకటాపురం భూదేవినగర్‌లోని మహాబోధి విద్యాలయంలో ప్రజాయుద్ధ నౌక గద్దర్‌ సమాధిని సందర్శించి అంబేడ్కర్‌నగర్‌లోని జ్యోతిరావుపూలే, డాక్టర్‌ బీఆర్‌.అంబేడ్కర్‌, గద్దర్‌ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించి యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా యాత్ర చేస్తున్న శ్రీనివాస్‌ను అభినందించారు. గద్దర్‌ అభిమాన సంఘం అధ్యక్షులు సీఎల్‌.యాదగిరి, రాజయ్య శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌ విషయమై కండక్టర్‌పై దాడి



పోలీసులతో వాగ్వివాదం చేస్తున్న ప్రయాణికురాలు సరిత (ఫైల్‌)

కుషాయిగూడ: ఆధార్‌ విషయంలో ఓ ప్రయాణికురాలు, కండక్టర్‌ ఘర్షణ పడ్డారు. ఆంధ్రప్రదేశ్‌ ఆధార్‌ను కండక్టర్‌ నిరాకరించడంతో ఆగ్రహించిన ప్రయాణికురాలు కండక్టర్‌ పట్ల దురుసుగా వ్యవహరించి చేయి చేసుకుంది. దీంతో కండక్టర్‌ పోలీసులను ఆశ్రయించడంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆమెకు సర్దిచెప్పే ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. పైగా పోలీస్‌స్టేషన్‌ గేటు వద్ద బైఠాయించి ధర్నాకు దిగింది. ఈ క్రమంలో పోలీసులు తప్పని పరిస్థితుల్లో ఆమెపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈనెల 4న చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలను పోలీసులు సోమవారం వెల్లడించారు. 4న ఈసీఐఎల్‌ నుంచి ఉప్పల్‌ వెళ్తున్న (ఏపీ29, జెడ్‌ 3181) ఆర్టీసీ బస్సులో కొయ్యల సరిత అనే ప్రయాణికురాలు ఎక్కింది. కండక్టర్‌ గద్ద శ్రీదేవి టికెట్‌ తీసుకుంటుండగా.. సదరు ప్రయాణికురాలు సరిత ఆంధ్రప్రదేశ్‌ అడ్రస్‌తో ఉన్న ఆధార్‌ను చూపింది. ప్రభుత్వ నింబంధనల మేరకు తెలంగాణ ఆధార్‌ మాత్రమే చెల్లుబాటు అవుతుందని, ఇది చెల్లదని టికెట్‌ కొనుగోలు చేయాలని కండక్టర్‌ సూచించింది. దీంతో ఆగ్రహించిన ఆమె కండక్టర్‌తో గొడవకు దిగి, కండక్టర్‌పై చేయి చేసుకుంది. దీంతో కండక్టర్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

ప్రయాణికురాలిపై గతంలోనూ పలు కేసులు

పలువురు ప్రభుత్వ అధికారులను గతంలో బ్లాక్‌ మెయిల్‌ చేసిన ఘటనల్లో సరితపై అంబర్‌పేట్‌, భూపాలపల్లి జిల్లా వెంకటపురం, ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్లలో కేసులు నమోదైనట్లు పోలీసులు పేర్కొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

పాలస్తీనాపై ఇజ్రాయిల్‌ దాడులు ఆపాలని..



నిరసనలో పాల్గొన్న వామపక్ష నేతలు



ఈసీఐఎల్‌ చౌరస్తాలో..

కుషాయిగూడ: సీపీఎం కాప్రా సర్కిల్‌ కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పాలస్తీనాపై ఇజ్రాయిల్‌ దాడులకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. సోమవారం సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జె. చంద్రశేఖర్‌, సీపీఐ జిల్లా నాయకుడు కె.శంకర్‌రావులు హాజరై మాట్లాడారు. ఇజ్రాయిల్‌ పాలస్తీనాపై యుద్ధం ప్రకటించి వేలమందిని పొట్టన పెట్టుకుందని ఆరోపించారు. వామపక్ష నేతలు ఎస్‌. శ్రీనివాస్‌, ప్రసాద్‌, యాదగిరిరావు, వెంకటాచారి, లక్ష్మీనారాయణ, సత్యప్రసాద్‌, దుర్గయ్య, జీవీ.రావు, శివనారాయణ, ఎంఎస్‌.రావు, సోమయ్యాచారి, సుహాసిని, శశికళ, గౌసియా, రేష్మ, సాయిలు, కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

గాజాపై ఇజ్రాయిల్‌ దాడులు ఆపాలి..

మల్కాజిగిరి: గాజా పట్టణంపై ఇజ్రాయిల్‌ దాడులను నిలిపివేయాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు బాలమల్లేష్‌, సీపీఎం జిల్లా నాయకుడు కోమటి రవి డిమాండ్‌ చేశారు. కృపాసాగర్‌, కృష్ణమూర్తి, యాదయ్య, నర్సింగరావు, మంగ, మురళీమోహన్‌ తదితరులున్నారు.

ఉప్పల్‌ బస్‌ డిపో ఎదుట..

మేడిపల్లి: మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో ఉప్పల్‌ బస్‌ డిపో ఎదుట సోమవారం పాలస్తీనాపై జరుగుతున్న దాడులను అపాలని పాలస్తీనాకు సంఘీభావంగా సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఉప్పల్‌ డిపో వరంగల్‌ ప్రధాన రహదారిలో నిరసన చేపట్టారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్‌, మేడ్చల్‌ జిల్లా కార్యదర్శి సాయిలుగౌడ్‌, కార్యవర్గ సభ్యులు దశరథ్‌, ఆర్‌.కృష్ణమూర్తి, లక్ష్మి, ఏఐఎస్‌ఎఫ్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్‌, ఏఐకేఎస్‌ జిల్లా అధ్యక్షుడు నిమ్మల నర్సింహ, మండల కార్యదర్శి రమేష్‌, మాధవి, బీకేఎంయూ మండల కార్యదర్శి మహాలక్ష్మి, సీపీఐ నేతలు వీబీ బాల్‌రాజ్‌, కిషన్‌, సోమరాజు, పార్టీసభ్యులు, కార్యకర్తలు తదితరులున్నారు.

ఉప్పల్‌: గాజాలో ఇజ్రాయిల్‌ దాడులకు నిరసనగా వామపక్ష పార్టీల పిలుపుతో సీపీఐ నేతలు ఉప్పల్‌ చౌరస్తాలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామ్రాజ్యవాద అమెరికా అండదండలతో ఇజ్రాయిల్‌ చేస్తున్న దురాక్రమణ యుద్ధదాడులతో పాలస్తీనా అతలాకుతలం అయ్యిందన్నారు. దాదాపుగా 41 వేల మంది పాలస్తీయన్లు, వీరిలో ఎక్కువ మంది మహిళలు చిన్న పిల్లలు మృత్యువాత పడటం దారుణమన్నారు. ఇజ్రాయిల్‌ పౌరులు హత్యలు, హత్యాచారాలు, దాడులకు పాల్పడుతూ దారుణాలకు ఓడిగట్టడం సిగ్గు చేటన్నారు. సీపీఎం పార్టీ కార్యదర్శి జె. వెంకన్న, పద్మ, బాలరాజు, అంజయ్య, స్వరూప, మురళిమోహన్‌ తదితరులు పాల్గొన్నారు.